# రోడ్లపై కేంద్రానికి నివేదిక

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** భారీ వర్షాలు తెలంగాణ రహదారులను తీవ్రంగా దెబ్బతీశాయి. రాష్ట్రవ్యాప్తంగా 9 జిల్లాల్లోని 994 ప్రాంతాల్లో 1170 కిలోమీటర్ల మేర రహదారులు తీవ్రంగా దెబ్బతిన్నాయని ప్ర భుత్వం ప్రాథమికంగా నిర్ధారించింది. దెబ్బతిన్న రహదారులతో ప్రజలకు ఇబ్బందులు కల్గకుండా ప్రభుత్వం జెట్ స్పీడుతో నష్టనివారణా చర్యలకు ఉపక్రమిస్తోంది.

| జిల్లా | దెబ్బతిన్న రహదారులు | తాత్కాలిక అంచనా వ్యయం | పూర్తిస్థాయి అంచనా వ్యయం |
|---|---|---|---|
| ఆదిలాబాద్ | 158కిలోమీటర్లు | 338లక్షలు | 16611లక్షలు |
| కరీంనగర్ | 111 | 245 | 9400 |
| వరంగల్ | 64 | 181 | 6522 |
| ఖమ్మం | 62 | 263 | 9849 |
| మెదక్ | 157 | 428 | 8936 |
| నిజామాబాద్ | 352 | 827 | 18855 |
| రంగారెడ్డి | 75 | 225 | 4050 |
| నల్గొండ | 140 | 297 | 7440 |
| మహబూబ్‌నగర్ | 51 | 405 | 4970 |

Table: నష్టం అంచనా... మరమ్మతుల వ్యయం వివరాలు

ఇందులో భాగంగా ఆయా రహదారులను యుద్ధప్రాతిపదిక న మరమ్మత్తులు చేయాలని సర్కార్ నిర్ణయించింది. అందుకు అవసరమైన నిధులను కేటాయించే దిశగా సర్కార్ కృషి చేస్తోంది. వీటి మరమ్మత్తులకు తాత్కాలికంగా రూ. 32.09కోట్ల వ్యయం కానుందని సర్కార్ అంచనా వేసింది. తర్వాత పూర్తిస్థాయిలో వీటి మరమ్మత్తులకుగానూ రూ. 866.33 కోట్ల వ్యయం కానుందని గుర్తించి నివేదికలను సిద్ధం చేస్తున్నారు. ఈ మేరకు ఆర్ అండ్ బీ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక చర్యలకు శ్రీకారం చుట్టారు. ఇటీవలి వరద నష్టంపై అంచనాకు సమీక్షను నిర్వహించి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. మరింత సమగ్రంగా నివేదికలను రూపొందించి అందజేయాలని ఆదేశించారు. త్వరలో నష్టం వివరాలను కేంద్రానికి నివేదించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. వర్షాల కారణంగా రహదారులపై రాష్ట్రవ్యాప్తంగా 41 చెట్లు విరిగిపడ్డాయని వాటిని యంత్రాంగం వెంటనే అప్రమత్తమై తొలగించి రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకుందని తెలిపారు.